నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I | హైదరాబాద్, బుధవారం 8 మే 2024 | YADADRI BHUVANAGIRI


నల్లగొండలో బీఆర్ఎస్ ర్యాలీలో పాల్గొన్న పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

# పట్టభద్రుల ఎమ్మెల్సీ బీఆర్ఎస్‌దే

## నాలుగు సార్లు గెలిచాం.. మళ్లీ మనదే విజయం

- బీఆర్ఎస్ అభ్యర్థి గెలిస్తేనే నిరుద్యోగులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారం
- పదేండ్ల బంగారు తెలంగాణను నాలుగు నెలల్లో కాంగ్రెస్ సర్వనాశనం చేసింది
- రాష్ట్రంలో అత్యధిక ఎంపీ సీట్లను అందిస్తే కేంద్రాన్ని శాసించే స్థాయికి బీఆర్ఎస్
- కేసీఆర్ బస్సు యాత్రతో భయపడ్డ సీఎం రేవంత్ రైతు బంధు వేశాడు
- మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి
- కాంగ్రెస్ మోసపూరిత మాటలు నమ్మవద్దు
- మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతీరాథోడ్
- నల్లగొండలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి నామినేషన్
- కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ

నల్లగొండ, మే 7 : ఖమ్మం – వరంగల్ – నల్లగొండ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ నియోజకవర్గం ఆవిర్భవించిన నాటి నుంచి నాలుగు సార్లు ఎన్నికలు జరుగగా.. అన్ని సార్లూ బీఆర్ఎస్ అభ్యర్థులే గెలిచారని, ఈసారి కూడా గులాబీ జెండా ఎగుర వేసేందుకు పట్టభద్రులు సిద్ధంగా ఉన్నారని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ బీఆర్ఎస్ అభ్యర్థిగా ఏనుగుల రాకేశ్‌రెడ్డి మంగళవారం నల్లగొండలో నామినేషన్ వేశారు. ముందుగా నల్లగొండ జిల్లా కేంద్రంలో హైదరాబాద్ రోడ్డులోని లక్ష్మి గార్డెన్స్‌లో సమావేశం నిర్వహించారు. ఆ తర్వాత కలెక్టరేట్ వరకు పెద్ద ఎత్తున ర్యాలీగా వచ్చారు. అనంతరం మాజీ మంత్రులు జగదీశ్‌రెడ్డి, సత్యవతీరాథోడ్, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ తాతా మధుతో కలిసి రాకేశ్‌రెడ్డి ఏఆర్ఓ, ములుగు జిల్లా అదనపు కలెక్టర్ మహేందర్‌కు నామినేషన్ పత్రాలు అందజేశారు. అంతకుముందు లక్ష్మీగార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా బీఆర్ఎస్ అభ్యర్థి గెలిస్తేనే మండలిలో నిరుద్యోగులు, ఉద్యోగుల సమస్యలు పరిష్కారమయ్యే అవకాశం ఉంటుందన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తే వృథా అవుతుందని, అధికారంలో ఉన్న పార్టీని ఆ పార్టీ అభ్యర్థి ప్రశ్నించే అవకాశం ఉండదని పేర్కొన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పదేండ్లలో రాష్ట్రాన్ని బంగారు తెలంగాణ చేస్తే.. నాలుగు నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం సర్వనాశనం చేసిందని ఆరోపించారు. కేసీఆర్ బస్సు యాత్ర మొదలు పెట్టగానే సీఎం రేవంత్‌కు వణుకు మొదలై రైతు బంధు వేయడం మొదలు పెట్టారన్నారు. గత ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచిన చోట బీజేపీకి డిపాజిట్ రాలేదని, బీజేపీ గెలిచిన చోట కాంగ్రెస్‌కు డిపాజిట్ రాలేదని, అప్పుడు ఆ రెండు పార్టీలు పరస్పర సహాయం చేసుకొని ఓట్లు వేయించుకున్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ గెలవగానే కృష్ణానదిని కేఆర్ఎంబీకి అప్పగించారని, బీఆర్ఎస్ పోరుతోనే మళ్లీ అసెంబ్లీలో తీర్మానం చేశారని అన్నారు. గోదావరి నీళ్లను ఇచ్చంపల్లి ద్వారా కావేరిలో కలపడానికి ప్రధాని మోదీ ప్రయత్నం చేస్తున్నాడని, దాంతో కర్ణాటక, తమిళనాడుకు ప్రయోజనం జరిగి తెలంగాణకు తీవ్ర కరువు వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది ఆపడం ఒక్క కేసీఆర్ వల్లనే అవుతుందని, ఈ ఎన్నికల్లో 16 ఎంపీ సీట్లు ఇస్తే కేంద్రంలో ఎవరు అధికారంలోకి వచ్చినా మెడలు వంచి గోదావరి నీళ్లను కాపాడుకుంటామని అన్నారు. మైనార్టీల ఓట్లు దండుకున్న కాంగ్రెస్ ఆ వర్గాలకు ఎలాంటి న్యాయం చేస్తలేదని పేర్కొన్నారు. దేవుడి పేరు చెప్పి మోదీ ఓట్లు వేయించుకుంటే, కాంగ్రెస్ మాత్రం దేవుండ్ల మీద ఒట్లు వేసి దండుకుంటున్నదని విమర్శించారు.

సమావేశంలో ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, యాదాద్రి, సూర్యాపేట జడ్పీ చైర్మన్లు ఎలిమినేటి సందీప్‌రెడ్డి, గుజ్జ దీపికాయుగంధర్‌రావు, డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి, మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, నల్లమోతు భాస్కర్‌రావు, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, నోముల భగత్‌కుమార్, చిరుమర్తి లింగయ్య, బొల్లం మల్లయ్య యాదవ్, పైళ్ల శేఖర్‌రెడ్డి, బూడిద భిక్షమయ్య గౌడ్, తిప్పన విజయసింహారెడ్డి, పార్టీ రాష్ట్ర నేతలు ఒంటెద్దు నర్సింహారెడ్డి, పాల్వాయి స్రవంతి, రాంచందర్‌నాయక్, అన్నపూర్ణ, మందడి సైదిరెడ్డి, కటికం సత్తయ్యగౌడ్, చెరుకు సుధాకర్‌గౌడ్, చింతల వెంకటేశ్వర్‌రెడ్డి, రేగట్టె మల్లికార్జున్ రెడ్డి, బోనగిరి దేవేందర్, కడారి అంజయ్య యాదవ్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, వేదికపై పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డి, మాజీ మంత్రి సత్యవతీరాథోడ్, ఎమ్మెల్యే పల్లా, ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ ఎంపీ బడుగుల, ఉమ్మడి జిల్లా మాజీ ఎమ్మెల్యేలు, బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు


సమావేశానికి హాజరైన బీఆర్ఎస్ శ్రేణులు, ప్రజలు

### గెలిపిస్తే ప్రశ్నించే గొంతుక అవుతా



నన్ను ఎమ్మెల్సీగా గెలిపిస్తే మండలిలో ప్రశ్నించే గొంతుక అయి నిరుద్యోగులు, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తా. ఈ నియోజకవర్గం నుంచి అన్ని సార్లు బీఆర్ఎస్ అభ్యర్థులే గెలిచారు. ఈ సారి నాకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపిస్తే మండలిలో పట్టభద్రుల సమస్యలపై ప్రశ్నిస్తా. బీఆర్ఎస్‌లో ఉన్న స్వేచ్ఛ బీజేపీలో ఉండదు. ఆ పార్టీలో నాకు కనీస గౌరవం ఇవ్వలేదు. కేసీఆర్ ఎంతో గౌరవంతో టికెట్ ఇచ్చి పోటీ చేయిస్తున్నారు. మార్పు పేరుతో ప్రజలు కాంగ్రెస్‌కు అధికారం ఇస్తే రాష్ట్రాన్ని ఆగమాగం చేసింది.

– ఏనుగుల రాకేశ్‌రెడ్డి, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి

### కాంగ్రెస్ మోసపూరిత మాటలు నమ్మొద్దు



అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎన్నో మోసం మాటలు, హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చింది. మరోసారి నమ్మి ఆ పార్టీకి ఓట్లు వేయవద్దు. గ్రాడ్యుయేట్లు ఆలోచించి బీఆర్ఎస్ అభ్యర్థికి ఓటేస్తే సమస్యలు పరిష్కరించడానికి రాకేశ్‌రెడ్డి పోరాటం చేస్తారు. తెలంగాణ సాధించిన కేసీఆర్ పదేండ్లలో రాష్ట్రాన్ని ఎంతో అభివృద్ధి చేస్తే.. ఈ నాలుగు నెలల్లో సీఎం రేవంత్ సర్వనాశనం చేసి వ్యతిరేకతను మూట కట్టుకున్నారు. ప్రధానంగా రైతులను ఆగం చేసి వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేశారు. కేసీఆర్ రైతును రాజుగా నిలబెట్టి రైతు బంధు పెడితే.. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రైతు బంధు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారు. కేసీఆర్ నోటిఫికేషన్ ఇస్తే ఉద్యోగ పత్రాలు ఇచ్చిన కాంగ్రెస్.. తామే ఉద్యోగాలు ఇచ్చినట్లు చెప్పడం సిగ్గుచేటు. కాంగ్రెస్ మోసాలు బయట పెట్టాలంటే ఎంపీలు, ఎమ్మెల్సీగా బీఆర్ఎస్ అభ్యర్థులు గెలవాలి. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ మన అభ్యర్థులు గెలిస్తేనే ఈ ప్రభుత్వాన్ని నిలదీయవచ్చు.

– మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతీరాథోడ్

### కేసీఆర్ రాకతో జనంలో మళ్లీ కొత్త ఉత్సాహం



శాసనసభ ఎన్నికల తర్వాత కేసీఆర్ అనారోగ్యంతో మూడు నెలలు బయటకు రాలేదు, ఇటీవల ఆయన బయటకు రాగానే కేంద్రంలో బీజేపీకి, రాష్ట్రంలో కాంగ్రెస్‌కు వణుకు మొదలై ప్రజల్లో కొత్త ఉత్సాహం వచ్చింది. గ్రాడ్యుయేట్లు రెండు సార్లు తనను ఎమ్మెల్సీగా గెలిపించారు. ఈ సారి రాకేశ్‌రెడ్డిని గెలిపించాలి. కాంగ్రెస్ అభ్యర్థి బ్లాక్ మెయిల్ తత్వం గ్రాడ్యుయేట్లకు తెలుసు. ఎక్కడా గెలవలేక కాంగ్రెస్ కండువా కప్పుకొని వచ్చే తీన్మార్ మల్లన్నను చిత్తుచిత్తుగా ఓడించాలి. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే డిసెంబర్ 9న ఇస్తామన్న జాబ్ క్యాలెండర్, 50వేల ఉద్యోగాలతో మెగా డీఎస్సీ, నిరుద్యోగులకు రూ.4వేల భృతి, కాలేజీ అమ్మాయిలకు స్కూటీలు, ఐదు లక్షల గ్యారెంటీలు ఎక్కడ పోయాయి. కేసీఆర్ వేసిన నోటిఫికేషన్ పత్రాలు ఇచ్చి ఉద్యోగాలు ఇచ్చామనడం సిగ్గుచేటు. బీఆర్ఎస్ ఉద్యోగులకు మంచి పీఆర్సీ ఇచ్చింది. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు ఎందుకు అమలు చేయడం లేదు.

– పల్లా రాజేశ్వర్‌రెడ్డి, జనగామ ఎమ్మెల్యే

### రాకేశ్‌రెడ్డి గెలిస్తే 34 నియోజకవర్గాల్లో మనం గెలిచినట్లే



ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో 34 ఎమ్మెల్యే నియోజకవర్గాలు ఉంటే.. అందులో మనం ఎక్కువ స్థానాల్లో ఓడిపోయాం. ఈ ఒక్క ఎమ్మెల్సీ గెలిస్తే మళ్లీ ఆయా నియోజకవర్గాల్లో మన ప్రాతినిధ్యం ఉంటుంది. అప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంతో మన ఎమ్మెల్సీ కొట్లాడే అవకాశం ఉంటుంది. నాలుగు నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం పాలనను గాలికి వదిలేసింది. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బస్సు యాత్ర పెట్టిన తర్వాతనే ఈ ప్రభుత్వం రైతు బంధు డబ్బులు వేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్ఎస్ నాయకులను టార్గెట్ చేసి కేసులు పెడుతుంది. అలాంటి ఫాల్స్ కేసులకు భయపడవద్దు. గులాబీ సైనికులు శక్తివంచన లేకుండా కృషి చేసి బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించుకోవాలి.

– గాదరి కిశోర్‌కుమార్, తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే

### బీఆర్ఎస్ కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి



బీఆర్ఎస్ గెలిస్తేనే రాష్ట్రంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు, సంక్షేమ పథకాలు అమలవుతాయి. గత ఎన్నికల్లో కాంగ్రెస్ అడ్డగోలు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చింది. ఎంపీలు, ఎమ్మెల్సీలు మన వాళ్లు ఉంటే ఆ పార్టీని, ప్రభుత్వాన్ని నిలదీసే అవకాశం ఉంటుంది. పార్లమెంట్ నుంచి స్థానిక సంస్థల ఎన్నికల వరకు మన అభ్యర్థులను గెలిపించేందుకు కార్యకర్తలు సైనికుల్లా పోరాటం చేయాలి. బీఆర్ఎస్ పదేండ్లు అధికారంలో ఉన్నందునే తండాలన్నీ గ్రామ పంచాయతీలు అయ్యాయి. 4శాతం నుంచి పది శాతం ఎస్టీ రిజర్వేషన్లు పెరిగాయి.

– రమావత్ రవీంద్రకుమార్, మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు

# ఐదో రోజు 14 నామినేషన్లు

- ఈ నెల 9వరకు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ నామినేషన్ల స్వీకరణ
- 10న స్క్రూటినీ 13న ఉపసంహరణ
- 27న పోలింగ్, జూన్ 5న లెక్కింపు

నల్లగొండ, మే 7 : వరంగల్ – ఖమ్మం – నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గం శాసనమండలి ఉప ఎన్నికల్లో భాగంగా ఐదో రోజు మంగళవారం 14 నామినేషన్లు దాఖలయ్యాయి. బీఆర్ఎస్ నుంచి ఏనుగుల రాకేశ్‌రెడ్డి.. మాజీ మంత్రులు గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ తాతా మధుతో కలిసి నామినేషన్ వేశారు. జాజుల భాస్కర్ (శ్రమజీవి పార్టీ), ఈడ శేశగిరిరావు (అలయన్స్ డెమోక్రటిక్ రిఫామ్స్), నందిపాటి జానయ్య (తెలంగాణ సకల జనుల పార్టీ), స్వతంత్ర్య అభ్యర్థులు ఐతగోని రాఘవేంద్ర, పిడిశెట్టి రాజు, పూజారి సత్యనారాయణ, బండారు నాగరాజు, మారం వెంకట్‌రెడ్డి, గుగులోతు భీమా, పెంచల శ్రీనివాస్, కంటె సాయన్న, ధైద సోమసుందరం, అల్వాల కనకరాజు నామినేషన్ వేశారు. నామినేషన్ పత్రాలను నల్లగొండ కలెక్టరేట్‌లోని రిటర్నింగ్ అధికారి ఆఫీసులో ములుగు జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి సీహెచ్ మహేందర్‌కు సమర్పించారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఈ నెల 9వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. 10న స్క్రూట్నీ, 13న నామినేషన్ల ఉపసంహరణ, అనంతరం అదే రోజు అభ్యర్థుల జాబితాను ప్రకటించి గుర్తులను కేటాయిస్తారు. ఈ నెల 27న పోలింగ్ నిర్వహించి వచ్చే నెల 5న లెక్కింపు చేపట్టనున్నారు.


కట్టంగూర్‌లో మాట్లాడుతున్న బీఆర్ఎస్ భువనగిరి ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్, పక్కన మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి

# నమ్మించి మోసం చేసిన కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి

- బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్‌ను గెలిపించాలి
- నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

కట్టంగూర్, మే 7 : కాంగ్రెస్ ప్రభుత్వం అలివి కాని హామీలిచ్చి అరచేతిలో వైకుంఠం చూపిస్తూ ప్రజలను మోసం చేస్తుందని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. బీఆర్ఎస్ భువనగిరి ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్‌తో కలిసి కట్టంగూర్ మండల కేంద్రంలో మంగళవారం రోడ్ షో నిర్వహించారు. వర్షాన్ని సైతం లెక్క చేయకుంగా రోడ్ షోలో ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో చిరుమర్తి మాట్లాడుతూ ఎన్నికల్లో ఓట్లు దండుకోవడానికి మోసపూరిత మాటలు చెప్పడం సరికాదన్నారు. ఐదు నెలల్లో కాంగ్రెస్‌పై ప్రజలకు నమ్మకం పోయిందన్నారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ ప్రజల సంక్షేమం, ప్రాంతాల అభివృద్ధి, సాగు, తాగునీటికి ఇబ్బందులు లేకుండా సుపరిపాలన అందించారని తెలిపారు. ప్రజలు ఆలోచించి బీఆర్ఎస్ అభ్యర్థి క్యామ మల్లేశ్‌కు ఓటు వేయాలని కోరారు. క్యామ మల్లేశ్ మాట్లాడుతూ వర్షాన్ని సైతం లెక్క చేయకుండా వచ్చిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. 13న జరిగే ఎన్నికల్లో తనకు ఓటు వేసి ఎంపీగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జడ్పీటీసీ తరాల బలరాములు, నాయకులు పోగుల నర్సింహ, పెద్ది బాలనర్సయ్య, రెడ్డిపల్లి మనోహర్, అంతటి శ్రీను, చౌగోని జనార్దన్, పనస సైదులు, పిన్నపురెడ్డి నర్సింహ, గాజుల బుచ్చమ్మ, గుండగోని రాములు, కత్తుల దేవేందర్, నర్సిరెడ్డి పాల్గొన్నారు.


సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతు కె.జెండగే

# పోలింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- కలెక్టర్ హనుమంతు కె.జెండగే

భువనగిరి కలెక్టరేట్, మే 7 : పోలింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంతు కె.జెండగే నోడల్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో వివిధ విభాగాలకు చెందిన నోడల్ అధికారులతో మంగళవారం సమావేశమై పోలింగ్‌కు ముందు, పోలింగ్ రోజు చేపట్టే విధులపై సమీక్షించి మాట్లాడారు. రిపోర్టులను సకాలంలో సమర్పించాలని, పోలింగ్ కేంద్రాల మార్క్‌డ్ కాపీలు సిద్ధం చేయాలని, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల నుంచి పోలింగ్ కేంద్రాలకు ఈవీఎం యంత్రాలు, సిబ్బంది కోసం బస్సులను సిద్ధం చేయాలని ఆదేశించారు. అసెంబ్లీ సెగ్మెంట్ ప్రకారం కేటాయించిన వాహనాలకు జీపీఎస్ ట్యాగింగ్ నిర్వహించాలని, సాక్ష్యం యాప్ ద్వారా వీల్‌చైర్లు, రవాణా తదితర అవసరాలకు దరఖాస్తు చేసుకున్న దివ్యాంగ ఓటర్లకు వసతులు కల్పించాలని సూచించారు. ప్రజలకు వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, పోలింగ్ కేంద్రాల్లో ఆశ వర్కర్లు, వైద్య సిబ్బంది, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, కనీస మందులు ఏర్పాటు చేయాలని, మెడికల్ సిబ్బంది నియామకం ప్లాన్ ప్రకారం నిర్వహించాలని అన్నారు. భువనగిరి ఆరోరా కాలేజీలో, ఆలేరు ఇండోర్ స్టేడియంలో ఏర్పాటయ్యే డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లో 12న ఉదయం నుంచి 13న రాత్రి వరకు వైద్య శిబిరాలు, అంబులెన్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల్లో టెంటు, తాగునీరు, కనీస వసతులు తప్పనిసరిగా ఉండాలన్నారు. పోలింగ్‌కు ముందు రోజు రాత్రి, పోలింగ్ రోజు సిబ్బందికి టిఫిన్, భోజన వసతులు కల్పించాలని సూచించారు. ఎన్నికల నిబంధనల ప్రకారం పోలింగ్‌కు 72 గంటల ముందు నుంచి చేయవలసిన పనులను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ పి.బెన్ షాలోమ్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ నాగేశ్వరాచారి పాల్గొన్నారు.

# దంచికొట్టిన వాన

- జిల్లాలో మోస్తరు నుంచి భారీ వర్షం
- పలు చోట్ల తడిసిన ధాన్యం
- ఈదురుగాలులకు దెబ్బతిన్న పండ్ల తోటలు.. రాలిన మామిడి
- ఎండల నుంచి ఉపశమనం పొందిన జనం
- బొమ్మలరామారంలో 63.3 మిల్లిమీటర్ల వర్షపాతం
- నేడూ జిల్లాలో భారీ వర్షం : వాతావరణ శాఖ

యాదాద్రి భువనగిరి, మే 7 (నమస్తే తెలంగాణ) : తీవ్రమైన ఎండలు, వడగాలులతో అల్లాడిపోతున్న ప్రజలపై వరుణుడు కరుణ చూపాడు. మంగళవారం మధ్యాహ్నం వరకు ఎండలు మండిపోగా.. సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. మహారాష్ట్రలోని తూర్పు విదర్భ నుంచి తమిళనాడు రాష్ట్రం వరకు ఏర్పడిన ద్రోణి ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా నల్లని మేఘాలు కమ్మేశాయి. మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. దాంతో ప్రజలకు తీవ్రమైన ఎండల నుంచి ఉపశమనం లభించినట్లయింది. నిర్విరామంగా కురిసిన వానలతో జిల్లా తడిసి ముద్దయింది. కాలనీలు చెరువులను తలపించాయి. రహదారులు నీటితో నిండిపోయాయి. అనేక ప్రాంతాల్లో చెట్లు, కరెంట్ స్తంభాలు నేలకొరిగాయి. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వర్షంతో కరెంట్ సరఫరా నిలిచిపోయింది. గంటల తరబడి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగడంతో జనం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మరో వైపు వర్షంతో పలు చోట్ల కల్లాల్లోని ధాన్యం తడిసి ముద్దయింది. పంట పొలాలు నేలకొరిగాయి. ఈదురుగాలులతో పండ్ల తోటలు ఆగమయ్యాయి. మామిడి పండ్లు, కాయలు రాలిపడ్డాయి. ఫలితంగా అన్నదాతకు తీవ్ర నష్టం కలిగింది. జిల్లాలో అత్యధికంగా బొమ్మలరామారంలో 63.3 మి.మీ. వర్షపాతం నమోదైంది. బుధవారం కూడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది.




భూదాన్ పోచంపల్లిలో రోడ్లపై నిలిచిన నీరు


చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్‌లో తడిసిన ధాన్యం

### యాదగిరిగుట్ట క్షేత్రంపై మెరుపుల కనువిందు

యాదగిరిగుట్ట, మే 7 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి క్షేత్రంపై మెరుపులు కనువిందు చేశాయి. మంగళవారం సాయంత్రం విమాన గోపురంపైన సుదర్శన మహాచక్రానికి మెరుపులు మెరిశాయి. ఓవైపు స్వర్ణకాంతులతో ఆలయం ధగధగతో ఆలయం మెరుస్తుండగా.. మరోవైపు సుదర్శన చక్రం నుంచి ప్రజ్వరిల్లినట్లు వచ్చిన మెరుపులు అద్భుత దృశ్యాన్ని ఆవిష్కరించాయి. ఇలా పలుమార్లు రాజగోపురాల శిఖరాల నుంచి వస్తున్నట్లుగా మెరుపులు కనువిందు చేశాయి.

# ఓటు కోసం ఉద్యోగుల అవస్థలు

- జిల్లా వ్యాప్తంగా ఫెసిలిటేషన్ సెంటర్లలో పడిగాపులు
- 18వేల ఉద్యోగుల్లో ఓటేసింది 12వేల మంది మాత్రమే
- బ్యాలెట్ ఓటుకు నేటితో చివరి రోజు



నల్లగొండ, మే 7 : నార్కట్‌పల్లి మండలం నెమ్మాని గ్రామంలో పనిచేసే పరమేశ్ (పేరు మార్చాం) అనే ఉద్యోగికి ఓటు హక్కు మునుగోడులో ఉండగా.. భువనగిరి ఫెసిలిటేషన్ సెంటర్‌లో ఓటు వేయాలని మెసేజ్ వచ్చింది. ఎల్‌బీనగర్‌లో ఓటు హక్కు ఉన్న తేజశ్విని (పేరు మార్చాం) అనే మహిళా ఉద్యోగి నల్లగొండలోని ఒక బ్యాంకులో పని చేస్తుండగా నల్లగొండలోని ఫెసిలిటేషన్ సెంటర్‌లో ఓటు వేయాలని మెసేజ్ వచ్చింది. దాంతో మంగళవారం ఆమె కోమటిరెడ్డి ప్రతీక్‌రెడ్డి కళాశాలకు వచ్చి ఓటేద్దామంటే తన పేరు లేదని హెల్ప్ డెస్క్ చెప్పింది. ఈ విషయాన్ని అక్కడే ఉన్న నమస్తే తెలంగాణ విలేకరి ఆర్డీఓ రవి దృష్టికి తీసుకెళ్తే ఎల్‌బీనగర్‌కు వెళ్లి వేయాలని చెప్పడంతో వెనుదిరిగిన ఆమె అక్కడి వరకు ఏం వెళ్తాంలే అనే పరిస్థితి. చండూరులో పని చేస్తున్న ఒక ఉద్యోగికి ఓటు నకిరేకల్‌లో ఉంటే మిర్యాలగూడ ఫెసిలిటేషన్ సెంటర్ నుంచి మెసేజ్ వచ్చింది. నల్లగొండ పాలిటెక్నిక్ కళాశాలలో ఏడుగురు ఉద్యోగులకు డ్యూటీ పడితే ఒక్క మహిళా ఉద్యోగికే మెసేజ్ వచ్చి మిగిలిన వారికి రాకపోవడంతో నల్లగొండ ఫెసిలిటేషన్ సెంటర్ నుంచి వెనుదిరిగారు. ఇవీ జిల్లాలో ఎన్నికల డ్యూటీ పడి ఓటు కోసం ఇక్కట్లు పడుతున్న ఉద్యోగుల పరిస్థితి. జిల్లాలో మొత్తం 18వేల మంది ఉద్యోగులకు ఎన్నికల డ్యూటీలు పడ్డాయి. వీరికి ఇటీవల రెండు విడుతలుగా శిక్షణ ఇచ్చిన ఎన్నికల యంత్రాంగం ఈ నెల 13న జిల్లా వ్యాప్తంగా నిర్వహించే ఎన్నికల విధుల్లో పాల్గొనాలని ఆర్డర్ కాపీలు సైతం ఇచ్చింది. ఆర్డర్ కాపీలు తీసుకున్న ఉద్యోగులు ఆ రోజు ప్రత్యక్షంగా ఓటు హక్కును వినియోగించే అవకాశం లేదు. ఈ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా నియోజకవర్గానికి ఒక ఫెసిలిటేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేసిన అధికారులు.. ఉద్యోగుల నుంచి బ్యాలెట్ ద్వారా ఓటు స్వీకరిస్తున్నారు. అయితే.. డ్యూటీ పడ్డ ఉద్యోగులకు ఆర్డర్ పత్రాలు వచ్చినప్పటికీ ఒక నియోజకవర్గంలో ఓటు ఉంటే మరో నియోజకవర్గంలో ఓటు వేయాలని మెసేజ్‌లు రావడం, లేదంటే మెసేజ్‌లు అసలు రాకపోవడంతో ఓటు హక్కును వినియోగించుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 3నుంచి ఈ కార్యక్రమం కొనసాగుతుండగా నేటితో పూర్తి కానుంది. కానీ.. ఇప్పటి వరకు 12వేల మంది ఉద్యోగులు ఓటు వేయగా.. ఇంకా ఆరు వేల మంది ఓటు హక్కు వినియోగించుకోవాల్సి ఉన్నది.